# అమ్మాయి చదువు

(కథానిక)

అమ్మాయి చదువులేక అంతకంతకూ చిలిపిదై పోతూంది. దానికి ఆరేళ్లు వెళ్ళినా ఇంకా అక్షరంముక్క అలవడలేదు. అందుకు కారణం ఒక విధంగా బలమైందీ నమ్మతగిందీ కాక పోయినప్పటికీ- అంతకంటే కూడా వేరే హేతువు లేదు. కనుక చచ్చినట్టు వొప్పుకు తీరాలి. ఇది హాస్యాస్పదంగా ఆశ్చర్యంగా ప్రతివారికీ తోచవచ్చు. కాని అసలు రహస్య మేమిటంటే- నేను కాని, మావారు కాని అమ్మాయి చదువును గురించి ప్రత్యేకమైన శ్రద్ధ తీసుకోక పోవటమే. తీసుకోవాలిసిన అగత్యం వుందని తలిదండ్రులమైన మాకు తెలీక కాదు. అందులో మేమిద్దరమూ చదువు కున్నవాళ్ళమే. పోతే మా కుటుంబం కూడా నాగరీకానికి బలియై నాజూకులు బలిసిందే. అయితే, అమ్మాయి ఆడపిల్ల కావటం వల్ల ఎటుకూడీ ముందుముందు స్త్రీయై భర్త చెప్పుచేతల్లో వుండాలిసి వొస్తుంది కనుక విద్య అధికంగా రావాలిసిన అవశ్యకత లేదు కనుక- అమ్మాయిని ఇప్పటినుంచే చదివించటం దేనికి? అన్న అభిప్రాయం మాలో యేమూలో వుంది. అమ్మాయిపట్ల, ఆడపిల్ల అయిన పాపాన స్వార్థం దాగి అమ్మాయికి చదువు విషయంలో అట్లా ద్రోహంగా పరిణమించవచ్చు.

ఏమైనా అమ్మాయిపట్ల పక్షపాతం వహించటం అవివేకమని మొన్న ఈమధ్యనే నాకు వివరంగా తెలిసివొచ్చింది. మొన్న కృష్ణవేణమ్మ గారి యింటికి విందుకు వెళ్ళినప్పుడు, ప్రక్కన వున్న అమ్మాయిని పలుకరించి- "ఏం చదువుతున్నావు. అమ్మాయి" అన్నది. అమ్మాయి సమాధానం చెప్పలేక వెలవెల పోతూ నా వంక చూసింది. నాకు అపరిమితమైన న్యూనత వేసింది.

"ఆఁ! ఇంకా అక్షరాభ్యాసం చేయలేదండీ." అన్నాను. ఆమాటకు కృష్ణవేణమ్మ గారు విపరీతంగా విస్తుపోతూ, ఇటువంటి వింత జరగవలసింది కాదన్నట్టు,

"అదేమిటీ! ఇంకా అక్షరాభ్యాసం చేయ లేదంటే? నువ్వు చదువుకున్న దానివేగా. నీ మొగుడు నూటయాభై రూపాయల ఉద్యోగస్థుడు. మీ ఇద్దరకూ కలిసి కూతురుకు చదువు చెప్పించుకొనేపాటి తీరిక, జ్ఞానం లేకపోయినాయా! మా సుందరికి నాలుగో యేడు. రెండోతరగతి పుస్తకం చదువుతూంది. ఈ మాయదారి కాలంలో పిల్లలకి చదువు చెప్పించపోతే రేపు పిల్లలెందుకైనా పనికివస్తారా?" అన్నది.

ఇంక నేను యేముఖంతో యేమని మాట్లాడేది? "త్వరలో అక్షరాభ్యాసం చేయిస్తానత్తయ్యా!" అని పిల్లను రెక్క పట్టుకొని జట్కా యెక్కి సత్వరం యింటికి వొచ్చాను.

అప్పటినుంచీ అమ్మాయి చదువుమీద కృష్ణవేణమ్మగారి పుణ్యాన శ్రద్ధ కలిగింది.

మా వారితో అన్నాను. "ఏమండీ యిన్నాళ్ళనించీ అమ్మాయికి చదువు చెప్పించే బాధ్యత మనది కానట్టు వూరుకున్నాం. ఆరేళ్లు పైబడ్డా దానికి అక్షరం ముక్క రాలేదు. ఈ సంగతి లోకులు విని అసహ్యపడుతున్నారు. అసహ్యపడేది అమ్మాయిని కాదు, తలిదండ్రులమైన మనలను. మనమీద వాదు లేకుండా అమ్మాయి ముందుముందు బాగుపడగలందులకు (అమ్మాయి పరీక్షలు ప్యాసై ఉద్యోగాలు వెలగ బెట్టాలని మాకు లేనిమాట, కోరనిమాట వాస్తవమే. ఎందువల్లనంటే అది వాళ్ళ సంప్రదాయానికి తీరని కళంకం) చదువు చెప్పిద్దాం" అన్నాను.

నా మాటలకు మావారు నవ్వారు. "సరే, అట్లాగే చెప్పిద్దాం" అన్నారు. ఇంకో సమస్య, అమ్మాయికి ఎట్లా విద్య గరపాలి? ఇంటిదగ్గర ప్రయివేటు మాష్టర్ని పెట్టా? లేక గరల్సు

స్కూళ్లోకి పంపాం?

ఇంటికి ప్రయివేటుమాష్టర్ని రప్పించి చదువు చెప్పించటం డబ్బు ఖర్చుఅయ్యేమాట అటుంచి ప్రత్యేకమైన గది మా అద్దెయింట్లో కొళ్ళీలేదు. అందువల్ల గరల్స్ స్కూలే గతి అయింది. కాని మావారు "ఆ స్కూల్లోకి పంపినా లాభం లేదు. అమ్మాయికి చదువురాదు" అన్నారు. ఆ మాట ఎటు తిరిగీ సత్యమైనా- ఇంకో పని చేద్దామనిపించింది పేరుకు గరల్స్ స్కూలుకు అమ్మాయిని పంపిస్తూ, పంతులమ్మ యింటికి అమ్మాయిని పంపేపక్షాన మావారు అంగీకరించారు.

మరునాడు మళ్ళీ అమ్మాయి చదువు విషయమై హెచ్చరించగా మావారు అమ్మాయిని గరల్స్‌స్కూల్లో జేర్చి తాయారమ్మ అనే పంతులమ్మ దగ్గర ప్రయివేటుకు కుదిరించారు. నెలకు అయిదురూపాయలు.

అమ్మాయి నిత్యం సక్రమంగా సకాలానికి బళ్ళోకీ ప్రయివేటుకూ వెళుతూంది. తల దువ్వటం, నీళ్లు పోయటం, కొత్త దుస్తులు తొడగటానికి నాకు తీరిక లేకపోయినా అమ్మాయే త్వరత్వరగా ఆ పనులు ముగించుకొని బళ్లోకి వెళుతూంది.

బళ్ళో ప్రవేశించిన దగ్గర్నుంచీ అమ్మాయి ప్రవర్తనలో చాలాభాగం మార్పు వచ్చింది. ఆ మార్పునుచూసి సంతోషిస్తున్నాం కాని, నేను కాని, మావారు కాని పరీక్షించలేదు. తీరిక విరివిగా లేకపోవటంమూలాన అటువంటి పరీక్షజరగలేదు. ఒళ్లోకి వెళ్ళకముందు అమ్మాయి నాకు కొన్ని పనుల్లో సహాయంచేసేది. ముఖ్యంగా చంటివాడు యేడుస్తూంటే ఎత్తుకొని. ఇప్పుడు అమ్మాయిని "అబ్బాయినెత్తుకో" అనే అవకాశం నాకు లేకపోతూంది అమ్మాయి చదివే పూపిరాడని చదువువల్ల. ఇంటిదగ్గర అమ్మాయి ఎన్నడూ అక్షరాలుదిద్దటం కాని, గుణింతాలు చదవటం కాని చేసేదికాదు. అవన్నీ స్కూల్లోనూ, ప్రయివేటులోనూచదువుతూందని అనుకోవలసి వస్తుంది. అట్లాగే అనుకుంటున్నాం కూడా.

ఎందుకోమరి అమ్మాయి చదువును పరీక్షించాలని నాకు బుద్ధి పుట్టింది. ఒకరోజు అమ్మాయి బళ్ళోకి పోతోంటే ఆపాను.

"ఎందుకు" అన్నది.

"పనివుంది" అన్నాను.

"యేంపని. పని వుంటేమాత్రం బళ్లోకి పోకుండా యెట్లా చదువు వ్యర్థంకాదూ" అన్నది అమ్మాయి చదువుపట్ల మహాశ్రద్ధ, దీక్ష వున్నదానికిమల్లే.

"అబ్బో! ఒక్కరోజుకే నీవు చదివేచదువు వ్యర్థం కాదులే" అన్నాను.

అమ్మాయి యేమనలేక పలకా పుస్తకాలు యింట్లో పెట్టింది. అమ్మాయిని స్కూలుకూ, ప్రయివేటుకూ పంపించి దాదాపు తొమ్మిది నెలలు కావొస్తున్నవి. ఈతొమ్మిది నెలతలోపల ఎంతచదువొచ్చిందో?

భోజనం చేశాక పుస్తకాలూ పలకా తీసుకు రమ్మన్నాను. పుస్తకాలేమున్నాయ్? రెండో తరగతి పుస్తకం, ఎక్కాలపుస్తకం, లెక్కల నోట్సు.

తీసకొచ్చింది. అక్షరాలు వరసగా వ్రాయమన్నాను. ఈ ప్రశ్న అమ్మాయికి వెధవ ప్రశ్నగా కనిపించింది. రెండోతరగతి పుస్తకం అయిపోవస్తేకూడా ఇంకా అక్షరాలు వ్రాయమనటం యేమిటి? అనుకొంది. "అక్షరాలేమిటి? రెండోతరగతి పుస్తకం అయిపోవస్తూంటే!" అన్నది.

"అయితేమాల్లే. వ్రాయి" అన్నాను గట్టిగా. బిక్కమొఖంవేసి నావంక చూసింది. కొంచెంసేపు వుండి వ్రాయటం మొదలెట్టింది. అరాయటం అరగంటరాసి నాకు చూపించింది. ఆ రాసిన అక్షరాలు చూసిన నాకు నవ్వాలో, అమ్మాయి చదువుకు, కొట్టాలో అర్థంకాలేదు. మొత్తం 22 అకరాలు రాసింది. మిగిలినవాటి విషయం అటుంచి ఆ రాసిన అక్షరాలు కుదురుగా లేకపోతేమాల్లే కొన్నిటికి వికృత రూపాలు కల్పించింది.

"ఇదేనా చదువు!" అన్నాను.

"ఇంకేమిటి?" అన్నట్టు నావంక చూసింది, ఆశ్చర్యంగా.

"ఇన్ని నెలలనుంచీ యిదేనా నీవు నేర్చుకొంది" అన్నాను.

"ఇంకా ఎక్కాలూ, లెక్కలూ కూడా

వొచ్చు" అన్నది, అమ్మాయి.

"సరే. మూడు నాలుగులు ఎంత?" అన్నాను.

కొంచెం సేపు ఆలోచించి - "ఇంకా నాలుగోయెక్కం చెప్పలేదు" అన్నది. మూడో ఎక్కం చెప్పారని వొప్పుకున్నది.

"నాలుగు మూడులు ఎంత" అనిఅడిగాను.

"తొమ్మిది" అని వెంటనే చెప్పింది. అమ్మాయి చదువుకు నవ్వొచ్చింది. అయితే లెక్కలు ఎంతవరకొచ్చో పరీక్షిద్దామని "రూపాయికి ఎన్ని బేడలు?" అన్నాను.

లోలోపల గుణించుకొంటున్నది. "బేడకు ఒక్క గుడ్డు. అర్థరూపాయికి నాలుగు గుడ్లు వొచ్చినివి. రూపాయికిఎన్ని అర్ధరూపాయలు?"

"కోడిగుడ్లేమిటే?" అన్నాను కోపంగా.

"కోడిగుడ్డు బేడ. నిన్న అర్ధరూపాయి యిచ్చి పంతులమ్మగారు కోడిగుడ్లు తెమ్మంటే నాలుగు వొచ్చినవి" అన్నది అమ్మాయి.

"నిన్నెందుకు తీసుకురమ్మంది కోడి గుడ్లు" అన్నాను నేను.

"రోజూ తెచ్చేది నేనే. నాకు కోడిగుడ్డు వండటం కూడా చాతనౌనే అమ్మా! రోజూ పంతులమ్మగారు నా చేతనే వండిస్తుంది. చాపలు కూడా నా చేతనే చట్టిలో కడిగిస్తుంది. చాపలు కూర వండటం యింకా నేర్పలేదు" అనివుత్సాహంతో అంటున్నది అమ్మాయి. నాకు అపరిమితమైన కోపమూ, నవ్వూ ఒక్కసారే కలిగినయ్.

"ఇంకా పంతులమ్మగారు ఏంచేయిస్తుంది" అన్నాను.

"పిల్లని ఎత్తుకుంటాను ఎప్పుడూ. కూరగాయలు తరుగుతూంటాను" అన్నది.

"ఇంతేనా పంతులమ్మ చెప్పే చదువు" అన్నాను. అమ్మాయికి కూరలు వండటం చేతనౌనంటే సింతోషించలేక.

"ఆఁ!" అన్నది అమ్మాయి. నిజం చెప్పేసి వూరుకుంది.

కొంచెం సేపట్లో మా వారు వొచ్చారు ఆఫీసునుంచి. "అమ్మాయిని యింటి దగ్గర అట్టిపెట్టావేం. ప్రయివేటుకు పోనీకుండా" అన్నారు.

అమ్మాయి చదువును గురించి యేం చెప్పేది మా వారితో?

క థా ని క

# దమ్మిడీకి పనికిరాని దద్దమ్మ

యం. సూరి

అంతకుముందు నాకున్న అనుమానం, ఈ మధ్య జరిగిన ఒక విచిత్ర సంఘటనతో అద్దకం అంటినట్లు మెదడుకు వూడకుండా అంటింది. అదేమి టంటారా? అది బట్టల దోపిడిలోని రంగు ఫిరాయింపు.

నేను చేస్తున్న వుద్యోగం చేతి కందటానికి పడ్డ చిక్కులన్నీ చెప్పాలంటే చాట భారత మౌతుంది. అసలు ఇంతకాలంనుండి రేషను కార్డు దొరికేందుకే దుర్లభమై దొంగ మార్కెటుతో మాడిపోతున్నానంటే ఇంకవున్న విషయాలన్నీ చెబితే మీరే, వుసూరుమంటారు.

ప్రతివాడు "ఏమిట్రా ఎప్పుడూ చింపిరి పేలికలతోనే పనికివస్తావు" అనే వాండ్లు. అమావాస్యకు అటిడుపులాగా ఒక్కరోజు సెలవుదొరికితే మళ్ళీ నెలవరకు సంసారాన్ని సవరించుకోవాలి. అంతకూ ఒకనాడు వీలుచేసుకొని ఎన్నాళ్ళనుండో కంట్రోలు బట్ట కొందామని దాచుకొన్న పైసలతో బజారు అంగళ్ళకెళ్ళి "కంట్రోలు బట్ట వుందా?" అని అడిగేశా. "రేషను కార్డు వుందా?" అని సమాధానం వచ్చింది. వుందంటే ఏమంటారో అనుకొని "ఆ" అన్నా. "బట్ట అయిపోయింది. బోర్డు కనపట్టంలా" అని పొమ్మన్నట్లు పలికారు.

నేనుకొనే చొక్కా బట్టకు మార్కెటుకెళితే నవ్వుతాలుగా వుంటుందనకొని, మళ్లీ